క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ బాబుల్‌రెడ్డి

పుల్లంపేట : అనంతసముద్రం గ్రామ పంచాయతీలోని పాపగ్గారిపల్లెలో సిమెంటు రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి గ్రామానికి సిమెంటు రోడ్డు పనులకు అవసరమయ్యే నిధులను కేటాయించేలా చర్యలు చేపట్టారు. గురువారం రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు రంగారెడ్డిలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ కరస్పాండెట్ వై.నందకిషోర్‌గౌడ్ పేద పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఎస్‌ఆర్ పాళెం సమీపంలోని ఎస్టీ కాలనీలలో గురువారం తమ స్కూల్ విద్యార్థులతో కలిసి ఒక్కొక్క చిన్నారికి రెండు జతల చొప్పున దుస్తులను నందకిషోర్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజులు, ఉపాధ్యాయులు చైతన్య, శివశంకర్, సుజిత, భాగ్య, స్వాతి, అనుపమతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు కంటి వెలుగు ప్రసాదించడమే లక్ష్యం



ఆపరేషన్లకు వెళ్తున్న కంటి రోగులు

పెనగలూరు : ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా పెనగలూరు నుంచి 58 మందికి కంటి ఆపరేషన్‌లు చేయించేందుకు తిరుపతి వేంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సులో తీసుకెళ్లినట్లు రూపానందరెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో కంటికి సంబంధించి ఆపరేషన్‌లు ఉచితంగా చేయించి తిరిగి స్వగ్రామానికి చేరుస్తామని వారు తెలిపారు. పేదలకు కంటి వెలుగును ప్రసాదించడమే తమ లక్ష్యమన్నారు. రెండో విడతలో కూడా 45 మందికి శస్త్ర చికిత్సలు చేయించానున్నామని పేర్కొన్నారు.

కాలువలో పడి.. తల్లడిల్లి..



ఆవును బయటకు తీస్తున్న స్థానికులు

కురబలకోట : మండలంలోని అంగళ్లు కదిరి రోడ్డు పక్కన మేతకు వెళ్లిన ఓ పాడి ఆవు ప్రమాదవశాత్తు గురువారం సిమెంటుతో కట్టిన సైడు కాలువలో పడి ఇరుక్కుపోయింది. బయటకు రాలేక నరకయాతన పడింది. అటుగా వెళుతున్న స్థానికులు గమనించారు. మండలంలోని మట్లివారిపల్లె గ్రామం ఎర్రమద్దివారిపల్లె జ్యోతికి చెందిన ఆవుగా గుర్తించారు. దీనికి కట్టెల సాయంతో తాళ్లు కట్టి బయటకు తీశారు. స్వల్ప గాయాలతో బతుకు జీవుడా అంటూ ఆ ఆవు ఊపిరి పీల్చుకుంది.

శిల్పారామంలో కళాకారుల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో గురువారం బక్రీద్ పర్వదిన సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పులివెందులకు చెందిన శ్రవణ్ డ్యాన్స్ అకాడమి కళాకారులు స్థానిక కళాబృందాలతో కలిసి సాంస్కృతిక వేదికపై తమ ఆటపాటలతో సందడి చేశారు. పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బోనాల సమర్పణ

కలికిరి : పత్తేగడ గ్రామం కొటాలలో వెలసిన సల్లాపురమ్మ జాతర ఉత్సవంలో భాగంగా గురువారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. కొటాలలో ఇంటింటి నుంచి భక్తులు బోనాలు తీసుకెళ్లి సల్లాపురమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం.. సమస్యల తక్షణ పరిష్కారం

- ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం
- టీడీపీ హయాంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- జగన్ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ధృవీకరణ పత్రాలు
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి

రైల్వేకోడూరు : ప్రతి ఇంటిలో ఉండే ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు చూడటమే జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ప్రభుత్వం ప్రజల కోసం ఇప్పటికే వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గృహసారథులు, వలంటీర్లను కలుపుకుని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో రేషన్, పెన్షన్, ఇళ్ల పట్టాలు తదితర కార్డులు కావాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడటువంటి పరిస్థితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు సంబంధించిన పత్రాలు, సరిఫికెట్లు, ప్రభుత్వ పథకాల సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ పనుల నిర్వహణ కోసం మండలాధికారులు స్థానికంగా రెండు టీంలుగా ఏర్పడి ఎక్కడిక్కడ క్యాంపులు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న సురక్షలో వివిధ పథకాల కింద అర్హులుగా గుర్తించిన వారిని జులై 1వ తేదీన అర్హత పత్రాలు వలంటీర్ల ద్వారా నేరుగా వారి గడప వద్దకే అందజేస్తామన్నారు.

ఉనికిని కోల్పోయిన టీడీపీ..

రాజకీయంగా ఉనికిని కోల్పోతున్న టీడీపీని బ్రతికించుకునేందుకు ఆ పార్టీ దిగజారి వ్యవహరిస్తోందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర పేరుతో యువగళం మొదలుపెట్టిన రోజే సొంతబావను పొట్టనపెట్టుకున్న లోకేష్, మరోపక్క స్థిరత్వం లేని పవన్‌కళ్యాణ్‌లు ఇద్దరూ రాజకీయాలకు అనర్హులని ఆరోపించారు. పిట్టకథలు చెప్పే పిట్టలదొర పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు చీకొట్టినా సిగ్గులేకుండా ఈ రోజు మళ్లీ చంద్రబాబు లాంటి మోసగాడితో కలిసి నీచ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. అలాగే యువగళంలో అసలు గళమే లేదని ఎద్దేవ చేశారు. మళ్ళీ మళ్ళీ సీఎంగా వైఎస్ జగనే వస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్‌లు సాయికిషోర్‌రెడ్డి, మండల నాగేంద్ర, చిట్వేల మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పట్టణంలోని సోడిశెట్టి నగర్‌లో నూతన సీసీరోడ్డు నిర్మాణ పనులకు గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లకు మహర్దశ కలిగిందన్నారు. జగన్ ప్రభుత్వంలో పట్టణాలలో వీధివీధికి, ప్రతి పల్లెపల్లెకు రోడ్లు వేసేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు.

కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు

పుల్లంపేట : పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డిలు అన్నారు. గురువారం పుల్లంపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెల్ఫేర్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మడగలం శ్రీనివాసులుకు నియామకపత్రాలను అందజేశారు. పదవి రావడానికి సహకరించిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, గంగిరెడ్డి, బాబుల్‌రెడ్డిలకు రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి, పార్థసారథి, శివ, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న ప్రభుత్వవిప్

మండల పరిధిలోని పుత్తనవారిపల్లి గ్రామంలో గురువారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, వెంకటరెడ్డి, నలిని కుమార్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు వాహనాల వేలం

మదనపల్లె : పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్(ఎస్‌ఈబీ)లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో వాహనాల వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు మదనపల్లె ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్‌ను 9440902595 అనే ఫోన్ నంబర్‌పై సంప్రదించాలన్నారు.

ఆలయానికి ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్‌ను అందజేస్తున్న దాతలు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె లైఫ్‌కేర్ మెడికల్ నాగసుబ్రమణ్యం, శేషుకుమార్‌లు రూ.20 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను వితరణగా ఇచ్చారు. గురువారం వారు మల్లయ్యకొండకు చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఇన్వర్టర్‌ను పూజారి ఈశ్వరప్పకు అందజేశారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్ రెడ్డి, కొండకిట్ట, భక్తులు అభినందించారు.

ఆజాద్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్

రాయచోటి అర్బన్ : భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆయన డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మతోన్మాదాన్ని, మనువాద భావజాలాన్ని, కులవివక్ష రూపాలను రూపుమాపేందుకు చంద్రశేఖర్ ఆజాద్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రజాభిమాన్ని చూరగొని గొప్ప ఉద్యమనేతగా అవతరించాడన్నారు. దీనిని జీర్ణించుకోలేని ఉత్తరప్రదేశ్‌లోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం, మద్దతుదారులు సహరాన్‌పూర్‌లో ఆజాద్‌పై కాల్పులు జరిపి అంతమొందించేందుకు తీవ్రంగా ప్రయత్నించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆజాద్‌పై హత్యాయత్నం చేసి దుండగులను గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలంటూ కోరారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ నేతలు పండరయ్య, సుధాకర్, బాబు, పెద్దగంగులయ్యతో పాటు పలువురు ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : ఆషాఢ శుద్ద తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో విశేష పూజోత్సవాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కల్యాణపురం విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు భగవత్ విజ్ఞాపనం, మహాసంకల్పం, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన అర్జున తపస్సు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం అర్జున తపస్సు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్న ప్రాంతంలో తపస్మాన్ ఏర్పాటు చేశారు. ద్రౌపతి సమేత పాండవులు, శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి భక్తి శ్రద్దలతో తపస్మాన్ వద్దకు తీసుకు వచ్చారు. తపస్మాన్ వద్ద అర్జునుడు, శివపార్వతుల వేషధారులు, యజ్ఞ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున వేషధారుడు కౌరవులపై విజయం సాధించడానికి శివున్ని మెప్పించి పశుపదార్థం సాధించే తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అర్జునుడు ఒక్కో మెట్టు ఎక్కుతూ పాడిన పద్యాలు భక్తులను కట్టిపడేశాయి. అర్జున వేషధారి తపస్మాన్ పైకి ఎక్కి అక్కడి నుంచి నిమ్మకాయలు, వివిధ రకాల పండ్లు, విబూది, మిఠాయిలు విసిరారు. అవి దక్కిన వారికి శుభం కల్గుతుందనే నమ్మకంతో భక్తులు వాటికోసం పోటీ పడ్డారు. సంతానం లేని మహిళలు, కోర్కెలు తీరాలని భక్తులు తపస్మాన్ వద్ద వరపడ్డారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాని ఏఐఎస్‌ఎఫ్ రాయచోటి ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, లోకేష్‌లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలకులు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలో విఫలమవుతున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎక్కడా జీఓ నం. 1ని అమలు చేయడం లేదన్నారు. ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలోనూ ఫీజుల పట్టికను ప్రదర్శించడం లేదన్నారు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లితండ్రులను దోచుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకులు ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయని పక్షంలో తాము పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ ఏరియా సహాయకార్యదర్శులు గిరిబాబు, నాగేంద్ర, ఉపాధ్యక్షుడు ఓబులేశు, వెంకటకుమార్‌లు పాల్గొన్నారు.

సౌమ్యనాథాలయంలో వైభవంగా తొలి ఏకాదశి



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఎంపీపీ మేడా దంపతులు



ఊంజల్ సేవలో సౌమ్యనాథుడు

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథాలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉభయ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన వసతులను కల్పించారు. తొలిఏకాదశి సందర్భంగా డీఆర్‌ఓ సత్యనారాయణ సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట డీటీ తహసీల్దారు మోహనకృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో టీటీడీ అర్చక స్వాములు, వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీటీడీకి పట్టువస్త్రాలు అందజేత

సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జులై 4న జరిగే కళ్యాణానికి ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి దంపతులు టీటీడీకి పట్టువస్త్రాలను అందజేశారు. వీరికి టీటీడీ అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా గర్భాలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను టీటీడీ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టరు దిలీప్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమిశెట్టి సునీతాప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నేతలు అరిగెల నాని, నాగసుబ్బయ్య, ఓర్సు శ్రీను, కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడికి మెరుగైన వైద్యం అందాలి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డిలు

రాయచోటి : కార్పొరేట్ వైద్యశాలలో సైతం పేదలకు తక్కువ ఖర్చుకే మెరుగైన వైద్యం అందివ్వాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిలు అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో నూతనంగా నిర్మించిన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వడ్డెరులు రాజకీయంగా చైతన్యం చెందాలి



సమావేశం అనంతరం వడ్డెర సంఘం నాయకులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : రాష్ట్రంలో వడ్డెర్లు రాజకీయంగా చైతన్యం చెందాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు కెవి రమణ పిలుపునిచ్చారు. గురువారం వీరబల్లె మండల పరిధిలోని వడ్డెపల్లె గ్రామంలో వడ్డెర్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లు 40 లక్షల మంది ఉన్నా రాజకీయంగా ఎదగలేదన్నారు. కులవృత్తికే అంకితమై జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అన్ని రంగాలలో ఎదగాలంటే ముందుగా రాజకీయంగా ఎదగాలన్నారు. అందుకు వడ్డెరులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం మేధావుల సలహాదారు జీవానందం, స్థానిక ఎంపీటీసీ రావూరి శ్రీనివాసులు, స్థానిక వడ్డెర సంఘం నాయకులు రాజేష్, రెడ్డి శేఖర్, నరసింహులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలలో ఆదర్శంగా నిలవాలి



నూతన కార్యవర్గంతో మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా స్వచ్ఛందంగా సేవలు కొనసాగించి రాయచోటి శాఖలో ఆదర్శంగా నిలవాలని మాజీ రెస్కో చైర్మన్ సదిపిరాళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాయచోటి నూతన కార్యవర్గం ఏర్పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా జీవీ రామానాయుడు, కోశాధికారిగా ఎం.రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంచుల ఖాదర్ బాషా, కార్యవర్గ సభ్యులుగా పీరయ్య, శ్రీధర్‌రెడ్డి, ఎ.వెంకట్రామిరెడ్డి, పురం మురళీమోహన్, డాక్టర్ ధరణిలను ఎన్నుకున్నారు. అనంతరం మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి దాతృత్వంతో రెండవ శాంతిరథాన్ని అందజేశారు.

'ఆరోపణలు నిరూపించకపోతే చట్టపరమైన చర్యలు'



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

రాయచోటి టౌన్ : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై చేసిన ఆరోపణలు నిరూపించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. గురువారం మదనపల్లె వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు హబీబ్‌ఖాన్, మైనార్టీ నాయకులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఐటీడీపీ సామాజిక మాధ్యమంలో చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి నిత్యం ప్రజాసేవ, సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం దక్కించుకున్నారన్నారు. అలాంటి నాయకుడిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యేపై చేసిన అసత్య ప్రచారాలను నిరూపించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, హారూన్ బాషా, అల్తాఫ్, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ నవరంగ నిస్సార్, జాఫర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా కొత్త పాఠశాలల్లో చేరిన కొంతమంది ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల వేతనాల సమస్యను అధికారులు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం కడప గాంధీనగర్ స్కూల్లో డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సాంకేతిక కారణాల వల్ల బదిలీలలో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే గతంలో జరిగిన పదోన్నతులలో నిరాకరించిన ఉపాధ్యాయులకు సీనియార్టీ జాబితాలో లేని వారికి త్వరలో జరగబోయే పదోన్నతులలో అవకాశం కల్పించాలని కోరారు.

ఘనంగా ఈద్- ఉల్- జుహ ప్రార్థనలు

ఈద్ – ఉల్ – జుహ (బక్రీద్) ప్రార్థనలు రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిల్లో ప్రశాంతంగా జరిగాయి. ఉదయాన్నే ఈద్గాలకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు దైవ సందేశాన్ని వినిపించారు. ప్రవక్త ఇబ్రహీం కుటుంబం చేసిన త్యాగాలను గుర్తుచేశారు. ప్రవక్త చూపిన విశ్వాసాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. చెడును విడిచి సన్మార్గం (దేవుడి) వైపు నడవడటమే మనం చేసే నిజమైన త్యాగం అని సందేశమిచ్చారు. కాగా ప్రార్థనల్లో ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



గాలివీడు: ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



రాజంపేట టౌన్: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాయచోటి టౌన్: ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు



చిట్వేలి: ఈద్గా వద్ద దువా చదువుతున్న దృశ్యం



లక్కిరెడ్డిపల్లె మండలంలో..



రైల్వేకోడూరు: ప్రార్థనలో పాల్గొన్న కొరముట్ల



సంబేపల్లె: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద..



చిన్నమండెంలో..



ఒంటిమిట్ట: దైవ సందేశాన్ని తెలుపుతున్న మతగురువు